క్రీడా రంగానికి పెద్దపీట

వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సినీనటుడు నిఖిల్ సిద్దార్థ్ తదితరులు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- బహుమతులు అందజేసిన మంత్రి, సినీ నటులు విశ్వక్ సేన్, నిఖిల్ సిద్దార్థ్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 7: తెలంగాణ ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నదని... జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 3 నుంచి మోండా డివిజన్ గ్యాస్ మండిలోని క్రీడా మైదానంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టిన రోజును పురస్కరించుకొని 'తలసాని ట్రస్ట్' ఆధ్వర్యంలో నిర్వహించిన తలసాని చాలెంజ్ కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్స్ ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి సినీ నటులు విశ్వక్ సేన్, నిఖిల్ సిద్దార్థ్‌లతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో చాలా మంది క్రీడాకారులకు చేయూతను అందించామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గానికి ఒక స్టేడియంను ఏర్పాటు చేశామన్నారు. క్రీడా పోటీల్లో గెలిచిన వారికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సినీ నటులు విశ్వక్ సేన్, నిఖిల్ సిద్దార్థ్ బహుమతులు అందజేశారు. పలువురికి మెమెంటోలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్-2లో గున్‌గల్ నుంచి సాహెబ్‌నగర్ వరకు ఉన్న 2200 ఎంఎం డయా ఎంస్ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు రాగన్నగూడ వద్ద భారీ లీకేజీ ఏర్పడింది. పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని.. ఈనెల 11న ఉదయం 6 నుంచి 12న ఉదయం 6గంటల వరకు మరమ్మతు పనులు చేయనున్నట్లు జలమండలి అధికారులు పేర్కొన్నారు.

అంతరాయం కలిగే ప్రాంతాలివే..

మీరాలం, బాలాలపూర్, మైసారం, బార్కాస్, మేకలమండి, భోలక్‌పూర్, తార్నాక, లాలాపేట, బౌద్ధనగర్, మారేడ్‌పల్లి, కంట్రోల్ రూం, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ, హస్మత్‌పేట, ఫిరోజ్‌గూడ, గౌతమ్‌నగర్, వైశాలినగర్, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కాపురికాలనీ, మహీంద్ర హిల్స్, ఎలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిలుకానగర్, బీరప్ప గడ్డ, బుద్వేల్, శాస్త్రిపురం, బోడుప్పల్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, శంషాబాద్, మన్నెగూడ ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అసోసియేషన్స్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సదస్సు

సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ సంగీతారెడ్డి

కొండాపూర్, అక్టోబర్ 7 : ప్రస్తుత ప్రపంచంలో ఆన్‌లైన్ సేవలను భౌతికంగా మిళితం చేసి వైద్య రంగంలో కొత్త యుగాన్ని సృష్టించాల్సిన అవసరం ఉన్నదని అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. శనివారం అపోలో మెడికల్ కాలేజ్, అపోలో హెల్త్ సిటీ ఆధ్వర్యంలో జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా - తెలంగాణ రాష్ట్ర చాప్టర్ 9వ వార్షిక సదస్సును ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టెలిమెడిసిన్, రోబోటిక్ సర్జరీ, హెల్త్‌కేర్ వాడకంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగిస్తున్నామన్నారు. వీటిలో ప్రతి ఒక్క విభాగం అభివృద్ధి అనుకున్న దానికంటే వేగంగా జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వెయ్యి మందికి పైగా సర్జన్స్ పాల్గొన్నారు.

లులు మాల్‌లో గ్రాండ్ కేక్ మిక్సింగ్ కార్నివాల్

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): నగరంలోని లులు మాల్‌లో గ్రాండ్ కేక్ మిక్సింగ్ కార్నివాల్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అత్యుత్తమమైన భారీ కేక్‌ను తయారీ చేయడానికి జీడిపప్పు, ఎండుద్రాక్ష, టుట్టీ ఫ్రూటీ, క్యాండీడ్ చెర్రీస్, లైమ్‌పీల్, ఆరెంజ్‌పీల్, దిగుమతి చేసుకున్న ద్రాక్ష రసంతోపాటు మిక్స్‌డ్ నేచురల్ మసాలాతో సహా 3500 కిలోల డ్రైఫ్రూట్‌లను మిక్సింగ్‌లో చేర్చారు. దీంతో పాటు క్రిస్మస్ వేడుక కోసం 20కి పైగా రకరకాల ప్రత్యేక కేక్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మిక్సింగ్‌లో లులు గ్రూప్ తెలంగాణ రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ సలీమ్, తెలంగాణ రీజినల్ మేనేజర్ అబ్దుల్ ఖదీర్ షేక్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

నాగోల్ మెట్రో వద్ద అదనపు పార్కింగ్

అందుబాటులోకి తీసుకొచ్చిన అధికారులు

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో కీలకంగా ఉన్న మెట్రో రైళ్లలో రద్దీ గణనీయంగా పెరుగుతోంది. ప్రధానంగా నగరానికి తూర్పు వైపు ఉన్న నాగోల్, ఉప్పల్ ప్రాంతాల నుంచి పడమర దిక్కున ఉన్న ఐటీ కారిడార్‌కు చేరుకునేందుకు అత్యంత సులభమైన మార్గం మెట్రోనే. ఈ నేపథ్యంలో నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లే వారు తమ వాహనాలను స్టేషన్‌లో పార్కింగ్ చేస్తున్నారు. పెరుగుతున్న వాహనాలను దృష్టిలో పెట్టుకొని మెట్రో కారిడార్-3లో ప్రారంభ మెట్రో స్టేషన్ అయిన నాగోల్‌లో వాహనాల కోసం అత్యాధునికంగా తీర్చిదిద్దిన పార్కింగ్ స్థలాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు తెలిపారు. ఇప్పటికే ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌కు స్థలం ఉంది. అదనంగా మరిన్ని వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఉప్పల్ మెట్రో డిపో, కమాండ్ కంట్రోల్ సెంటర్ పక్కన ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒకేసారి 600లకు పైగా పలు రకాల వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం ఉంది. నాగోల్ నుంచి హైటెక్ సిటీ, రాయదుర్గం మెట్రో స్టేషన్‌లకు చేరుకునేందుకు 50 నుంచి 55 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉండటంతో ఉప్పల్, నాగోల్, రామంతాపూర్ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు మెట్రోను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఆధునీకరించిన పార్కింగ్ ప్రదేశం

12 నుంచి టీటీడీ క్యాలెండర్లు విక్రయం

హిమాయత్‌నగర్, అక్టోబర్7: గ్రేటర్‌లోని భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్లు, డైరీలు హిమాయత్‌నగర్, లిబర్టీ వద్ద గల తిరునిలయంలోని బాలాజీ భవన్‌లో ఈ నెల 12నుంచి విక్రయిస్తున్నట్లు టీటీడీ ప్రత్యేక అధికారి రమేశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విక్రయాల కేంద్రం తెరిచి ఉంటుందని, డీలక్స్ డైరీ రూ.150, ఆర్డినరీ డైరీ 120, పన్నెండు షీట్స్ క్యాలెండర్ ఒకటి రూ.130, టేబుల్ టాప్ క్యాలెండర్ రూ.75, ఎస్‌వీ క్యాలెండర్ ఒకటి రూ.20, శ్రీవారి పద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.15, తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30కు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ బస్సుల్లో ప్రయాణం చేయండి

- జేఎన్‌టీయూ నుంచి వేవ్‌రాక్ వరకు రూ.50 చార్జి
- ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడి..

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఆర్టీసీ యాజమాన్యం అందుబాటులోకి తీసుకువచ్చిన 15 విద్యుత్ ఏసీ సిటీ బస్సులలో చార్జీలు తక్కువగా నిర్ణయించారు. సామాన్య ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 195 డబ్ల్యూ రూట్‌లో బాచుపల్లి-వేవ్‌రాక్ వరకు మొత్తం 7 విద్యుత్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ రూట్‌లో టిక్కెట్ ధర రూ.55, జేఎన్‌టీయూ నుంచి వేవ్‌రాక్ వరకు చార్జి రూ.50 గా నిర్ణయించారు. ఈ రూట్‌లో రోజూ ఉదయం 4.50 గంటలకు బాచుపల్లి నుంచి మొదటి సర్వీసు, వేవ్‌రాక్ నుంచి చివరి సర్వీసు రాత్రి 9.05 గంటలకు ప్రారంభమవుతుంది. అలాగే రూట్ 10 హెచ్‌డబ్ల్యూ రూట్‌లో సికింద్రాబాద్ నుంచి వేవ్‌రాక్ వరకు తిరుగుతున్న 8 విద్యుత్ ఏసీ సిటీ బస్సులలో టిక్కెట్ తక్కువగా నిర్ణయించారు. సికింద్రాబాద్ నుంచి జేఎన్‌టీయూ వరకు రూ.50, సికింద్రాబాద్ నుంచి వేవ్‌రాక్ వరకు రూ.60 నిర్ణయించినట్లు ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఈడి వి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ రూట్‌లో రోజూ ఉదయం 5.30 గంటలకు సికింద్రాబాద్ నుంచి మొదటి సర్వీసు, సాయంత్రం 8.25 గంటలకు వేవ్‌రాక్ నుంచి చివరి సర్వీసు బయలుదేరుతాయని ఈడీ పేర్కొన్నారు. ఈ రెండు మార్గాల్లో తిరిగే విద్యుత్ బస్సులు ఆ ప్రాంతాల్లో పని చేసే ఐటీతో పాటు ఇతర ఉద్యోగుల సౌకర్యం కోసం విద్యుత్ ఏసీ బస్సులు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ మార్గంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి 20 నిమిషాలకు ఒక సర్వీసు అందుబాటులో ఉంటుందని, అందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

పగలు కాలేజీకి.. రాత్రి చోరీకి

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థి అరెస్టు

జూబ్లీహిల్స్ / చాంద్రాయణగుట్ట, అక్టోబర్ 7 : ఉదయం కాలేజీకి వెళ్తూ రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్న ఓ విద్యార్థిని ఈస్ట్‌జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బండ్లగూడ నూరి నగర్‌కు చెందిన సుల్తాన్ సయ్యద్ అహ్మద్ హిలాల్ (22) బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నాడు. రాత్రి తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఇనుపరాడ్లతో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇటీవల బండ్లగూడకు చెందిన మమూన రెహ్మాన్ అనే మహిళ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్, బండ్లగూడ పోలీసులతో కలిసి నిందితుని వద్ద రూ.17 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలతో పాటు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ ఏవీఆర్.నరసింహారావు ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబుర్ర, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఎండి.షకీర్ అలీ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది సి.రాఘవేంద్రరెడ్డి, పి.సాయిరాం కేసు దర్యాప్తులో పాల్గొన్నారు. శనివారం నిందితున్ని అరెస్ట్ చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్, బండ్లగూడ పోలీసులను అభినందించారు.

ఇన్‌స్టాగ్రాంలో బాలికకు వేధింపులు

యువకుడిపై కేసు నమోదు

మెహిదీపట్నం,అక్టోబర్ 7: కల్లబొల్లి మాటలతో ఇన్‌స్టాగ్రాంలో తన బంధువుల అమ్మాయిని పరిచయం చేసుకున్న ఓ యువకుడు వేధింపులకు పాల్పడుతుండటంతో అతడి పై కేసు నమోదైంది. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు తన బంధువుల అమ్మాయిని ఇన్‌స్టాగ్రాంలో పరిచయం చేసుకున్నాడు. వీరు లంగర్‌హౌస్ ప్రాంతంలో నివసిస్తున్నారు. కొన్ని రోజులుగా బాలికను మాటల్లో పెట్టి కలుద్దామంటూ వేధిస్తున్నాడు. దీంతో బాలిక విషయం తన కుటుంబ సభ్యులకు చెప్పగా వారు శనివారం ఉదయం అతడిని మెహిదీపట్నానికి పిలిపించారు. అక్కడికి వచ్చిన యువకుడికి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసి లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు. యువకుడిపై పోలీసులు వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.